క్లుప్తంగా

పెండింగ్ డీఏలు ఇవ్వాలి



శేషుకుమార్, గంగరాజును సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు

నల్లజర్ల: పాత బకాయిలు ఇవ్వకపోయినా కనీసం పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలనైనా ప్రభుత్వం మంజూరు చేయాలని, మిగిలిన డీఏలు జనవరికి అందించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. నల్లజర్ల మండల పరిషత్ కార్యాయలంలో బుధవారం మండల శాఖ అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో నల్లజర్ల నంబర్–1 పాఠశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత సైనికుడు (హవల్దారు) తలంశెట్టి శేషుకుమార్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మానుకొండ గంగరాజును ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఉన్నమట్ల వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి ఐడీవీ అప్పారావు, ఆలీ సాహెబ్, కామేశ్వరావు, నెక్కలపూడి ప్రతాప్, గుత్తికొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం పంపిణీ

నల్లజర్ల: ఫీజు కట్టలేని స్థితిలో ఉన్న డిగ్రీ విద్యార్థినికి మానవత సంస్థ ఆర్థిక సాయం చేసింది. చీపురుగూడెం గ్రామానికి చెందిన చీమకుర్తి అంకిత స్థానిక ఎస్ఆర్‌కే కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. ఫీజు కట్టలేక ఆమె మానవత సంస్థను ఆశ్రయించగా.. బుధవారం కళాశాల పేరిట ఆమెకు రూ.10వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటరత్నం, ట్రెజరర్ ఐడీవీ అప్పారావు, డైరెక్టర్ పాతూరి సత్యనారాయణ, కార్యదర్శి ప్రత్తిపాటి రాంబాబు, విద్యా కమిటీ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీల ఆర్థిక పురోగతిపై శిక్షణ



సమిశ్రగూడెంలోని శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు

నిడదవోలు రూరల్: గ్రామ పంచాయతీలంతా ఆర్థిక పురోగతి సాధించేందుకు స్థానిక సంస్థల ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచికపై 2.0 పరివర్తన వ్యాప్తిపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఇటీవల మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావు, మాస్టర్ ట్రైనీ కె.శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల ఆర్థికాభివృద్ధిపై శిక్షణ

తాళ్లపూడి: గ్రామాల అభివృద్ధికి అందరు కలిసికట్టుగా పని చేయాలని, అప్పుడే అభివృద్ధి సాధించడం జరుగుతుందని ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు తెలిపారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీల ఆర్థిక పరిపుష్టి, ఆర్థికాభివృద్ధికి, గ్రామాల్లో మరింత అభివృద్ధి జరగాలంటే ఏ విధమైన కార్యాచరణ చేపట్టాలనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్ ఎల్ఈడీ స్క్రీన్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పోసిరాజు, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి పరశురామారావు, గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరం

చాగల్లు: మండలంలో బ్రాహ్మణగూడెంలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. షుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో కళ్లజోళ్లు, ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గారపాటి శివరామకృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు గారపాటి బాబురావు, సుంకవల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి సేవలు అందిస్తాం

దేవరపల్లి: ఇండియన్ బ్యాంకు ద్వారా పారిశ్రామిక, వ్యవవసాయ రంగాలకు విశేషమైన సేవలు అందిస్తున్నట్టు బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రణిష్ కుమార్ తెలిపారు. దేవరపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన శాఖను స్థానిక పరమేశు బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత తేతల ఉపేంద్ర రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఏటీఎం కేంద్రాన్ని పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్, పరమేశు బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ ఆనంద్ స్వరూప్ క్యాష్ కౌంటరను ప్రారంభించారు. రాజమహేంద్రవరం రీజియన్‌లో 65వ బ్రాంచ్‌ను దేవరపల్లిలో ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ఎండీ స్వరూప్ మాట్లాడుతూ, బ్యాంకు సహకారంతో విద్యా, వ్యాపార రంగంలో తాను రాణించినట్టు ఆయన తెలిపారు. బ్రాంచ్ డిప్యూటీ మేనేజరు శ్రీనివాస సాగర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జంక్షన్ ..యమ టెన్షన్

- నిబంధనలు పాటించని ఎన్‌హెచ్ అధికారులు
- నేటికీ ఏర్పాటు చేయని సెంట్రల్ లైటింగ్‌లు
- మూడేళ్లలో 102 మంది బలి, 230 మంది క్షతగాత్రులు
- ఈ ఏడాదిలో ఇప్పటివరకు 22 మంది మృతి

పెరవలి: జనం గమ్యం చేరడానికి రహదారులే కీలకం. పలు రాష్ట్రాలను అనుసంధానం చేయడంలో జాతీయ రహదారులది మరింత కీలక పాత్ర. ప్రయాణం సజావుగా సాగడానికి వీలుగా ఈ నేషనల్ హైవేలు అందుబాటులో ఉన్నాయి. ఈ హైవేలపై ప్రయాణం ఎంత సాఫీగా ఉంటుందో అంతే ప్రమాదకరం. ముఖ్యంగా గ్రామ కూడళ్ల వద్ద పాదచారులు, వాహనదారులు అటు నుంచి ఇటు వెళ్లేటప్పుడు అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాల బారిన పడుతుంటారు. అటువంటి జాతీయ రహదారిని అనుకుని ఉండే గ్రామ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన రోడ్డు కటింగ్‌లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గ్రామాల్లో ప్రధాన రహదారులు జాతీయ రహదారికి అనుసంధానంగా ఉండే చోటే ఈ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి.

మృత్యు మార్గాలుగా మలుపులు

మండలంలో 15 కిలోమీటర్లు విస్తరించి ఉన్న హైవేపై పెరవలి, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన ఈ మలుపులు మృత్యు మార్గాలుగా మారాయి. ముఖ్యంగా ఈ కట్టింగ్‌ల వద్ద రహదారి మలుపులు ఉండటం వల్ల రెండో వైపు వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు దాటే సమయంలో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు ఉదయం, సాయంత్రం సమయాల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయి. ఆ సమయాల్లో పొలాలకు వెళ్లే రైతులు, దూరప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉండటం, హడావుడిగా రోడ్డు దాటే సమయంలో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్నారు. పెరవలి మండలంలో గత మూడేళ్లలో 365 ప్రమాదాలు జరగగా.. ఇందులో 102 మంది మృతి చెందగా, 230 మంది క్షతగాత్రులు అయ్యారు. ఈ వివరాలు పోలీసు రికార్డుల్లో నమోదు అయినవి మాత్రమే. కాగా, నమోదు కాకుండా ఉన్నవి ఎన్నో ఉన్నాయి. ఈ ప్రమాదాలన్నీ గ్రామ కూడళ్ల వద్దే జరగడం విశేషం. జాతీయ రహదారి ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ గ్రామ కూడళ్ల వద్ద ఏర్పాటు చేయాల్సిన సెంట్రల్ లైటింగ్, స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్లు వంటివి ఎన్‌హెచ్ అధికారులు నేటికీ ఏర్పాటు చేయకపోవటంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, ప్రయాణికులు అంటున్నారు.

నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేస్తే చాలా?

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో హైవే 100 కిలోమీటర్లు ఉండగా.. ఎక్కువగా ప్రమాదాలు ఈ రహదారిపైనే జరుగుతున్నాయని రికార్డులు చెబుతున్నాయి. 2016లో జాతీయ రహదారిపై ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. కారణాలు ఏమిటని కమిటీని నియమిస్తే వారు సర్వే చేసి జిల్లాలో 16 చోట్ల అత్యంత ప్రమాదకరమైన కూడళ్లను గుర్తించారు. ఇందులో 6 చోట్ల ఒక్క పెరవలి మండలంలోనే ఉన్నాయని తెలియటంతో అధికారులు అందుకు తాత్కాలిక చర్యలు తీసుకొని వదలేశారు. అప్పట్లో గ్రామ కూడళ్ల వద్ద సర్వీస్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించినా నేటికీ అమలు కాలేదు. 2015లో డీజీపీగా పని చేసిన సాంబశివరావు తూర్పుగోదావరి నుంచి తాడేపల్లి వెళ్తుండగా ఖండవల్లి వద్ద ప్రమాదం జరిగితే తానే స్వయంగా కారు దిగి క్షతగాత్రులను తన కారులోనే తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాల నివారణకు పోలీసులు వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఈ గ్రామ కూడళ్ల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో పోలీసులు జాడ ఉండటం లేదని అంటున్నారు. గతంలో ఈ కూడళ్ల వద్ద పోలీసులు ఉండి వాహనాలను నియంత్రించే వారని, కూటమి ప్రభుత్వంలో అటువంటి ఏర్పాట్లు ఏమీ లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మూడేళ్లలో జరిగిన ప్రమాదాలివి

పెరవలి మండలంలోని జాతీయ రహదారిపై గత మూడేళ్లలో జరిగిన ప్రమాదాలు వల్ల 102 మంది మృతి చెందారు. 2021- 22లో 41 మంది, 2022–23లో 43 మంది, 2023- 24లో 23 మంది మృతి చెందారు. ఈ ఏడాది ఇప్పటికే 22 మంది మృతి చెందినట్లు పోలీస్ రికార్డుల్లో నమోదయ్యాయి. కాగా, రాజీలు జరిగినవి, కేసులు నమోదు కానివి ఎన్నో ఉన్నాయి.

ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం

జాతీయ రహదారి నిర్మాణంలో ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామ కూడళ్ల వద్ద డివైడర్లను (రోడ్డు కట్టింగ్‌లు) ఏర్పాటు చేసినప్పుడు గ్రామం నుంచి వచ్చే రహదారులకు స్పీడ్ బ్రేకర్లు నిర్మించాల్సి ఉన్నా ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఈ డివైడర్ల వద్ద పాదచారులు, వాహనదారుల కోసం జీబ్రా గుర్తులను వేయాల్సి ఉన్నా వాటిని వేయలేదు. ఈ గుర్తులు ఉన్నప్పుడు వాహనదారులు ఇది గ్రామ కూడలిగా గుర్తించి వేగాన్ని తగ్గించి ప్రయాణిస్తుంటారు. డివైడర్ల వద్ద ప్రమాద హెచ్చరికలు తెలిపే బొమ్మలు వేయాలి. కానీ, వాటిని వేయలేదు. వాహనాల వేగాన్ని తగ్గించడానికి స్పీడు కంట్రోలు స్టాప్ బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అవి కూడా లేని పరిస్థితి. కూడళ్ల వద్ద సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేసి అందుకు అనుగుణంగా ఐరన్ మెస్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ వాటిని కూడా పట్టించుకోలేదు. అంతేకాకుండా ఈ గ్రామ కూడళ్ల వద్ద సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నా అధికారులు ఎక్కడా పాటించకపోవడం కొసమెరుపుగా చెప్పవచ్చు. అధికారుల వీటిని ఏర్పాటు చేయకపోవడం వల్లే గ్రామ కూడళ్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు.



జాతీయ రహదారిపై గ్రామ కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు, పాదచారులు



పెరవలి వద్ద ప్రమాదకరంగా కూడలి



ఖండవల్లి వద్ద ప్రమాదానికి గురై నుజ్జైన ఆటో (ఫైల్)

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



జాతీయ రహదారిపై గ్రామ కూడళ్ల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవటం, సైడ్ రోడ్డులు లేక రోడ్డు దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నాం. వీటిని ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోవటం లేదు. రాత్రి సమయాల్లో సెంట్రల్ లైటింగ్ లేకపోవటం వల్ల ఇవి గ్రామ కూడళ్లు అనేది తెలియటం లేదు. వెంటనే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

– పంజా దుర్గారావు, ప్రయాణికుడు, కానూరు

జాతీయ రహదారిపై రద్దీ ఎక్కువ



ఉదయం, సాయంత్రం వేళల్లో హైవేపై ఎంతో రద్దీగా ఉంటుంది. ఆ సమయంలోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గతంలో పెరవలి సెంటర్‌లో పోలీసులు పహారా కాసేవారు. ఇప్పుడు ఎవరూ ఉండటం లేదు. దీని వల్ల వాహనాలు ఇష్టం వచ్చినట్లు రోడ్లపై ఆపటం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నాం.

– బొక్కే వెంకటేశ్వర్లు, ఖండవల్లి.

ప్రమాదాలను నివారించాలి



ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని నిత్యం ఆందోళన చెందుతున్నాం. అధికారులు గ్రామ కూడళ్ల వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

–రొట్టే నవీన్, తీపర్రు.

వైఎస్సార్ సీపీ కుటుంబాలకు వనిత పరామర్శ



దేవరపల్లిలో సత్యవతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తానేటి వనిత, పార్టీ నాయకులు



ఊనగట్లలో తులసి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తలారి వెంకట్రావు

దేవరపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత బుధవారం పర్యటించారు. పలువురు పార్టీ నాయకుల ఇళ్లకు వెళ్లి కటుంబసభ్యులను పరామర్శించారు. కురుకూరు ఎంపీటీసీ సభ్యుడు నిత్యానందం తల్లి సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో నిత్యానందంను పరామర్శించి, సత్యవతి చిత్రపటానికి నివాళులర్పించారు. బందపురంలో కాసాని సత్యం, గొల్లగూడెంలో గుండెపోటుతో కవులూరి సుందరరావు, యర్నగూడెంలో పంచాయతీ సభ్యురాలు కట్టా ఆశ ఇటీవల మరణించగా వారి కుటుంబీకులను ఆమె పరామర్శించారు. గ్రామంలో అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న బళ్ల సత్యనారాయణను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, ఎంపీపీ దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు, పార్టీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి కుసులూరి వెంకట సతీష్, యర్నగూడెం సర్పంచ్ బొంతా భరత్‌బాబు, పార్టీ నాయకులు సుంకర గంగరాజు, నరహరిశెట్టి సుధాకర్, బళ్ల సత్యనారాయణ మూర్తి, సుంకర రాంబాబు, దుగ్గిన గంగాధర్, ప్రసాద్, కామిశెట్టి దుర్గారావు, ఆచంట శ్రీనివాస్, పలువురు నాయకులు, కార్యకర్తలు ఆమె వెంట ఉన్నారు.

పలువురికి పరామర్శ

చాగల్లు: మండలంలోని ఊనగట్లలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు బుధవారం పరామర్శించారు. కొయ్యలముడి తులసి, గూడపాటి భాస్కరరావు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి తలారి వెంకట్రావు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరస్వామి, ఎంపీటీసీ ఆత్కూరి గోపీచంద్, సర్పంచ్ కుదప రాంబాబు నాయకులు ఇంటి వీర్రాజు, వి.కిషోర్, వి.శివ, కోటి, కె.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్.. అట్టర్ ఫ్లాప్

నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తలారి వెంకట్రావు



కొవ్వూరులోని బ్రిడ్జిపేటలో రచ్చబండలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): సూపర్ సిక్స్‌లో ఎన్ని పథకాలను అమలు చేశారో ముందు సమాధానం చెప్పి అప్పుడు సూపర్ హిట్ సంబరాలు చేసుకోవాలని, కానీ అది సూపర్ ఫ్లాప్ అనే విషయం ప్రజలకు తెలుసని కొవ్వూరు నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరులోని బ్రిడ్జిపేట 14వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు, మండల నాయకులు కలిసి గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీపై రచ్చబండ నిర్వహించి చంద్రబాబు 15 నెలల పాలనలోని మోసాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేయకుండా అరకొరగా ఇస్తూ.. ఇప్పుడు కొత్త నాటకం మొదలు పెట్టారని ఆయన మండిపడ్డారు. హామీలు అన్ని అమలు చేశాం అంటూ ప్రజలను తప్పుదొవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అని ఒకటి మాత్రమే ఇచ్చారని అన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతి నెల ఖాతాలో రూ.1,500 జమ చేశారా అంటూ ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఎక్కడిచ్చారు? అన్నదాత సుఖీభవ ఈ ఏడాది సగం కూడా ఇవ్వకుండా సూపర్ సిక్స్ హిట్ అంటూ సభ పెట్టారని విమర్శించారు. చంద్రబాబు మాట ఇచ్చి ప్రజలను మోసం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి పరిమి సోమరాజు, పార్టీ పట్టణ కన్వీనర్ చిట్టూరి అన్నవరం, కౌన్సిలర్ చీర అరుణ, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు దేవగుప్తాపు లక్ష్మణరావు, డానియేల్ రాజు, యాసరాపు శ్రీనివాసరావు అధిక సంఖ్యలో కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

చేపల చెరువుల లీజు వేలం వాయిదా

రంగంపేట: జి.దొంతమూరులోని చేపల చెరువుల లీజుకు సంబంధించి బుధవారం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన బహిరంగ వేలం వాయిదా వేసినట్టు కార్యదర్శి పి. శ్రీవల్లి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ, స్థానిక పంచాయితీ పరిధిలో 13 చెరువులు ఉన్నాయన్నారు. వాటిలో చేపల పెంపకానికి లీజుకు ఇవ్వడానికి బహిరంగ వేలం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. పోలీసు శాఖ అనుమతి లేనందున శాంతి భద్రతల సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున బుధవారం నిర్వహించాల్సిన వేలం వాయిదా వేసినట్టు తెలిపారు. వేలం ఎప్పుడు నిర్వహించేది పంచాయతీ ద్వారా త్వరలో తెలియజేస్తామన్నారు.

సదరం శిబిరం ఏర్పాటు



దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలో దివ్యాంగులకు ఉపకరణాలను ఉచితంగా అందజేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నిర్ధారణ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దుర్గారావు తెలిపారు. స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రత్యేక అవసరాలకు తగిన విధంగా ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాల జిల్లా సమన్వయకర్త కనకబాబు మాట్లాడుతూ, పాఠశాలల్లో చదువుకోవడానికి రవాణా ఖర్చులు, ఎస్కార్ట్ అలవెన్స్‌లు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబోధన అందించడంలో వెనుకబాటు చూపవద్దని తెలిపారు. ఎంఈఓ తిరుమలదాస్ మాట్లాడుతూ, దేవరపల్లిలో ఏర్పాటు చేసిన శిబిరంలో 80 మంది పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ చేసినట్టు తెలిపారు. శిబిరంలో ఎంఈఓ–2 అప్పారావు, గోపాలపురం, నల్లజర్ల మండలాల విద్యాశాఖ అధికారులు సత్యనారాయణ, ఆకుల ఉమామహేశ్వరరావు, భగవతీ దేవి, ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, భవిత్ కేంద్రాల ఉపాధ్యాయులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు చదువుపై ఆసక్తి పెంచుకోవాలి



వలంటీర్ టీచర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

నిడదవోలు: మహిళలు చదువుపై ఆసక్తి పెంచుకుంటే వారి పిల్లల భవిష్యత్ చక్కగా ఉంటుందని అక్షరాంధ్ర నోడల్ అధికారి వెంకటరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని బుధవారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరాంధ్ర నోడల్ అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ, 2029 నాటికి ఏపీ 100 శాతం వయోజన ప్రాథమిక అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో అక్షర ఆంధ్ర కార్యక్రమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దీని ద్వారా 15- 59 ఏళ్ల నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. దీని కోసం ప్రతి పది మందికి స్వయం సహాయక సంఘాల నుంచి ఒక వలంటీర్ టీచర్‌ను ఎంపిక చేశామన్నారు. గుర్తించబడిన టీచర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించి వారి పరిధిలోని అభ్యాసకులకు క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతను విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చినప్పుడే ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎదగడంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం వలంటీర్ టీచర్స్‌కు బోధన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ జ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సుజాత, సింధు, కల్పన, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రైళ్ల నిలుపుదల పునరుద్ధరించాలి



కొవ్వూరులో నిరసన తెలుపుతున్న రైల్వేస్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు

తాళ్లపూడి(కొవ్వూరు): పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో 2019 నాటి రైళ్లు నిలుపుదల పునరుద్ధరణ చేయాలని రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. కొవ్వూరు రైల్వే స్టేషన్ వద్ద బుధవారం రైల్వే శాఖ వైఖరిని ఖండిస్తూ స్టేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మన కొవ్వూరు– మన రైల్వే స్టేషన్, మన బాధ్యత అంటూ నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ, కొవ్వూరు రైల్వే స్టేషన్‌లోని రెండేళ్ల నుంచి స్టేషన్‌లో రైళ్లు నిలుపుదల కోసం పలుమార్లు విజ్ఞప్తులు చేసిన 2019 నాటి హాల్ట్‌లను పునరుద్ధరణ చేయడానికి రైల్వే శాఖ స్పందించట్లేదని ఆరోపించారు. ఎంపీ, ఎమ్మెల్యే, రైల్వే శాఖ అధ్యక్షులు వెంటనే పునరాలోచించి కొవ్వూరు స్టేషన్‌లో రైల్వే హాల్టులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు విల్సన్‌రాజు, గారపాటి రామ్మోహన్‌రావు, జగన్నాథరావు, చామర్తి విశ్వనాథరావు, అలీషా తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: సహకార సంఘాలు సభ్యుల సహకారంతో నడిచే స్వయం ప్రతిపత్తి సంస్థలని, సంఘాల అభివృద్ధిలో పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్, సభ్యులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారులు కీలక పాత్ర వహిస్తున్నారని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం నగరంలో రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం–2025 సందర్భంగా జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్లు, పాలకవర్గ విధులు, బాధ్యతలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సహకార సంఘాల అభివృద్ధికి పాలకవర్గం నిబద్ధతతో కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి మొడ్డేద్దుల కనకదుర్గారెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారి శ్రీనివాస్, సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్లు, సభ్యులు, సీఈఓలు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

శాంతి భద్రతలకు అదనపు పోలీస్ సిబ్బంది అవసరం

సీటీఆర్ఐ: రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు కల్పించేందుకు అదనపు పోలీస్ సిబ్బంది అవసరమని ప్రభుత్వం త్వరితగతిన పోలీసు సిబ్బంది నియామకాలు చేపట్టాలని బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సానబోయిన రామారావు కోరారు. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగరంలో శాంతిభద్రతలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కోటిపల్లి బస్టాండు సమీపంలో రాత్రి గస్తీలో ఉన్న పోలీస్ సిబ్బందిపై రౌడీ మూకలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసులకే రక్షణ కరువైతే సామాన్యుల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. దాడి జరుగుతున్న సమయంలో పోలీస్ సిబ్బంది స్టేషన్‌కి సమాచారం అందించినా సత్వరమే అక్కడికి వారు చేరుకోలేకపోవడానికి ప్రధాన కారణం సిబ్బంది, రక్షణ వాహనాల కొరతేనని అన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.రాత్రి సమయంలో బెల్ట్ షాపులు లేకుండా చర్యలు చేపట్టాలని, మద్యం దుకాణాల నిర్వహణ సమయం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్, బత్తిన ఏడుకొండలు, లాజర్ పాల్గొన్నారు.

అన్నదానం

నల్లజర్ల: అనంతపల్లి గంగానమ్మ గుడి వీధిలో రామాలయం వద్ద శ్రీబాలగణపతి 14వ వార్షిక ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి భారీ అన్నదానం జరిగింది. దాదాపు 4వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు యజ్ఞవరపు శ్రీహర్ష, కర్రిరాజు, తొంటపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.